
MB PUBLICATIONS
బంజాయ్

# బంజాయ్

(షాడో ఎడ్వంచర్)

రచన:

మధుబాబు

*© Author*

*© Madhu Baabu*

*This digital book is published by -*

[కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.]

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

*All rights reserved.*

*No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.*

# బంజాయ్

“తొందర పడకపోతే ప్రయోజనం లేదు గురూ! ఇటువంటి అవకాశం మరొకటి మన జన్మలో రాదు!!” అని అరుస్తూ లోపలికి పరిగెత్తుకు వచ్చాడు గంగారాం.

పది అడుగుల దూరంలో నిలబెట్టివున్న పెద్ద బండరాయి మీద దృష్టిని కేంద్రీకరించి వున్నాడు షాడో. గుండెల నిండా గాలి పీల్చుకొని, ఆ గది గోడలు దద్దరిల్లి పోయేటట్లు షౌట్ చేస్తూ అమాంతం గాలిలోకి ఎగిరాడు.

“అందమైన అనుభవాలు అవతల మన కోసం ఎదురుచూస్తుంటే, ఇలా కుప్పిగంతులతో టైం వేస్ట్ చేయడం దేనికి గురూ ?” అనబోతూ, చటుక్కున ఆ మాటల్ని మ్రింగేశాడు గంగారాం. ఎంత హడావుడిగా లోపలికి వచ్చాడో, అంతే హడావుడిగా బయటికి వెళ్ళి పోవటానికి ప్రయత్నించాడు.

అప్పటికే జరగవలసిన డామేజి జరిగిపోయింది.

కండరాలన్నిటినీ కంట్రోల్ చేసుకొని, చంచలమైన నేత్రాలను చలనంలేని ఏకాగ్రతలో బంధించి, నాభి కమలంలో నిక్షిప్తమై వుండే శక్తిని తన కుడి పాదంలోకి కేంద్రీకరించుకుంటూ గాలిలోకి లేచిన షాడో – తన కర్ణేంద్రియాలను కాచుకోవటం మరిచి పోయాడు.

కన్ను మూసి– కన్ను తెరిచే లోగా బండరాయిని సమీపించి ఒకే ఒక దెబ్బతో తునాతునకలు చేయవలసిన అతను, గంగారాం మాటలకు కాన్‌సన్‌ట్రేషన్ దెబ్బతిని, ఎవరో లాగిపెట్టి గుద్దినట్లు నేలమీద పడిపోయాడు.

అది చూసి ఖంగారు పడిపోయాడు గంగారాం.

“హాయిగా తిని, మరింత హాయిగా తిరగాల్సిన నీకు ఎన్ని కష్టాలు వచ్చాయి గురూ! వద్దు వద్దని ఎంత చెప్పినా ఈ దరిద్రపు కుంగ్‌ఫూని వదిలి పెట్టవు కదా!!” అంటూ గబగబా ఆ గది మూలన వున్న మంచినీళ్ళ కుండను తీసుకువచ్చి షాడో తలమీద కుమ్మరించాడు.

ఊపిరి ఆగి పోయినట్లు బాధ పడుతున్న షాడో, మెల్లిగా లేచి కూర్చున్నాడు తల విదిలిస్తూ.

“అబాషిరీ పట్టణంలో బ్రహ్మాండమైన కొరియన్ డాన్స్ ప్రోగ్రాం అరేంజి చేయబడిందట... ఆ ప్రోగ్రాంని చూడకపోతే అసలు బ్రతకటమే అనవసరంట– మనం కూడా పోయి చూసొద్దాం గురూ ....” అతని ప్రక్కనే చతికిల పడుతూ, మెల్లిగా తను వచ్చిన పనిని బయటపెట్టాడు గంగారాం.

టెంప్ట్ అయ్యాడు షాడో, అప్పుడప్పుడూ జపాన్ థియేటర్స్‌లో ప్రదర్శించబడే ఆ డాన్స్ ప్రోగ్రాముల గురించి అతను కూడా విని వున్నాడు.

“ఆల్‌రైట్ గంగూ. నువ్వు ముందుగా పోయి టిక్కట్లు రిజర్వ్ చేయించు. సాయంత్రం అయిదు గంటల కల్లా థియేటర్ దగ్గిరికి వచ్చేస్తాను.” అంటూ గంగారాం భుజం తట్టి, గది బయటవున్న మైదానంలోకి పరుగుతీశాడు.

మైదానం మధ్యలో పెద్ద రావి చెట్టు ఒకటి వుంది. రకరకాల గోనె సంచులు ఒకదాని మీద ఒకటిగా పేర్చి వున్నాయి దాని క్రింద. వాటి నిండా బరువైన గులకరాళ్ళు నింపి వున్నాయి.

ఒక సంచిని తల మీదికి ఎత్తుకున్నాడు షాడో. మరో రెండింటిని రెండు భుజాల మీదా పెట్టుకొని, తూర్పు దిశగా అడుగులు వేశాడు.

అంతవరకూ అతని మనస్సులో మెదులుతున్న కొరియన్ డాన్స్ ప్రోగ్రాం మాట మాటుమాయం అయిపోయింది. క్షణాలు గడుస్తున్న కొద్దీ భరించరానిదిగా అనిపించసాగింది అతను మోస్తున్న బరువు. క్రిందవున్న రాళ్ళమీదా, ముళ్ళమీదా పడి విపరీతమైన బాధను కలిగిస్తున్నాయి పాదాలు. అయినా సరే పట్టిన పట్టు వదలకుండా, సూర్యుడు నడి మింటిని చేరుకునే సమయంలో తోషి పర్వత శిఖరాన్ని చేరుకున్నాడు.

సెగలు వెలువరుస్తున్న ఒక పెద్ద బండరాయి మీద పద్మాసనం వేసుకొని ధ్యానముద్రలో వున్నాడు కుంగ్‌ఫూ విద్యాపీఠానికి అధిపతి అయిన శతవృద్ధుడు బాజూ అకరక్ చింగ్‌లీ.

అలసట ఆయాసాలతో ఉక్కిరి బిక్కిరి అవుతూ వచ్చిన షాడోని చూడగానే చిరునవ్వులు చిందిస్తూ బండరాయి మీద నిలబడ్డాడు.

మోసుకు వచ్చిన బరువును క్రిందికి దించి, అవనత వదనంతో ఆయనకు అభివాదం చేశాడు షాడో.

"సృష్టిలో వున్న ప్రతి వస్తువుకు, ప్రతి బరువుకు ఒక కేంద్ర స్థానం వుంటుంది రాజూ ... మామూలు కనులకు కనిపించని ఆ కేంద్ర స్థానాన్ని కనిపెట్టగలిగితే, ఎత్త రాని బరువుల్ని సైతం అవలీలగా ఎత్త వచ్చు. మీ భారతీయ పురాణ గాథల్లో శ్రీకృష్ణ భగవానుడు పాలుకారే పసితనంలోనే మహోన్నతమైన గోవర్ధన గిరిని చిటికెన వ్రేలిమీద నిలబెట్టాడని వుంది. ఇటు చూడు...." అంటూ చటుక్కున బండరాయి మీదినుంచి దిగాడు చింగ్‌లీ.

ఆయన కదలికలు షాడో కనులకు కనిపించలేదు. కన్ను మూసి కన్ను తెరిచేసరికి, అంతవరకూ ఆయన్ను భరించిన ఆ బండరాయి, దూది మూట మాదిరి గాలిలోకి లేచి ఆయన చేతులమీద నిలబడింది.

పాతికమంది బలాఢ్యులు కూడా కదిలించలేని ఆ బండరాయిని, అంత సులభంగా ఎత్త గలిగిన ఆయన శక్తికి ఆశ్చర్యపోతూ, అప్రయత్నంగా మోకాళ్లమీద నేలకు వాలి అభివాదం చేశాడు షాడో.

"సాధన చేస్తే సాధ్యంకానిది ఏదీ లేదు రాజూ... ఈ రోజు నీకు ఒక ప్రత్యేకమైన పోరాట పద్ధతిని నేర్పుతాను..." అంటూ బండరాయిని యథాస్థానంలో పెట్టి, దానిమీద కూర్చున్నాడు చింగ్‌లీ.

నడినెత్తి మీదికి వచ్చిన సూర్యుడు నిర్దాక్షిణ్యంగా వెలువరుస్తున్న వేడిమిని మరిచిపోయాడు షాడో. గంగారాంకి యిచ్చిన మాట కూడా అతని మనస్సులోనుండి

తుడిచిపెట్టుకు పోయింది. వేడెక్కిన ఆ బండరాళ్ళ మధ్య అలాగే బాసిపట్టు వేసుకొని చింగ్ లీ పలుకుల్ని శ్రద్ధగా ఆలకించసాగాడు.

## 2

"నాకు తెలుసు.... పడుతూ లేస్తూ యింత దూరం రావటం శుద్ధ దండగ. రావాల్సిన పెద్దమనిషి రాకముందే టిక్కట్లు తీసుకోవటం వట్టి దండగేకాదు... బుద్ధితక్కువ కూడా..." అనుకుంటూ కసిగా నేలను తన్ని, చేతిలోవున్న టిక్కట్లను చించి ముక్కలు చేసేశాడు గంగారాం.

టిక్కట్లు దొరక్క ఆడిటోరియం ముందు తచ్చట్లాడుతున్న ఒక పౌరుడు అది చూసి నివ్వెరపోయాడు.

"అదేమిటి బ్రదర్! అలా చించేయటం ఏమైనా బాగుందా ?" అని అడిగాడు ఉండబట్టలేక.

"నా టిక్కట్లు నా యిష్టం వచ్చినట్లు చేసుకుంటాను. నీ కెందుకు బే ?" కళ్ళు పెద్దవిచేసి గఁయ్‌మంటూ అతని మీదికి పోయాడు గంగారాం.

కంగుతిని, గబగబా వెనక్కి జరిగాడు ఆ పౌరుడు. అదేదో మెంటల్ హాస్పిటల్ నుంచి పారిపోయి వచ్చిన సరుకేమో అని అనుమానం కలిగింది కాబోలు, అర్జంటు పని గుర్తుకు వచ్చినట్లు హడావుడిగా అవతలకు వెళ్ళిపోయాడు.

కనిపించిన వాళ్లందర్నీ కరిచి పారేయాలన్నంత కసితో మండిపోతున్నాడు గంగారాం. మరో రెండు నిముషాలు ఆడిటోరియం ముందే నిలబడి, విసురుగా ఒక వీధిలోకి దారితీశాడు.

అప్పటికి ఆరుగంటలు అయింది. ఆడిటోరియంలోనుంచి కొట్టొచ్చినట్లు వినవస్తోంది. వళ్ళు జలదరించే కొరియన్ మ్యూజిక్. అది చెవులబడిన కొద్దీ అవధులు దాటుతోంది గంగారాం కడుపుమంట.

"నేను ఏమని అడిగాను ? మడులు అడిగానా ? మాన్యాలడిగానా ? ? అమెరికా తీసుకుపోయి హాలీవుడ్ తారల్ని చూపించమన్నానా ? ? ? అడక్క అడక్క ఒక్క డాన్స్ ప్రోగ్రాం చూపించమని అడిగితే అయిపు అంతు లేకుండా పోయిన ఆ పెద్దమనిషిని అసలు ఏం చేయాలి ?" అనుకుంటూ అడుగులు వేయసాగాడతను అబాషిరీ పట్టణం మధ్యలో వున్న బస్ స్టాండ్ వైపు.

వంద గజాల దూరంకూడా పోకముందే అతనికి ఎదురు పడ్డారు అరడజను మంది ఆగంతకులు. పరుగులాంటి నడకతో వస్తున్నారు వాళ్ళు.... రోడ్డుమీది ఎత్తుపల్లాల్ని కూడా లెక్క చేయటంలేదు.

సామాన్యంగా అటువంటి శాల్తీలను చూడగానే ప్రక్కకు తొలిగి దారి యిచ్చేస్తాడు గంగారాం. కాని అతనిలో రగులుతున్న ఆవేదన అలా చేయనీయలేదు యిప్పుడు. నిర్లక్ష్యంగా అలాగే నిలబడిపోయాడు వారి దారికి అడ్డంగా.

పెద్దపులులు వేటపడి తరుముతున్నట్లు హడావుడిగా వస్తున్నారు ఆ వ్యక్తులు. అడ్డంవచ్చిన గంగారాంని రఫ్‌గా ప్రక్కకు నెట్టారు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=822**

*** * ***

**Read other books of Mr. Madhubabu @**

**http://kinige.com/kbrowse.php?via=author&id=20**